# సతీ 'పురోగమనం'



సునీతాదేవి సతీ సహగమనం చేసుకోబోతుందన్న వార్త అగ్నికన్నా వేగంగా వ్యాపించింది మా కాలనీ అంతా!

శాయిరామ్, గోపాల్రావ్, రంగారెడ్డి, పార్వతీదేవి, రాజేశ్వరి, జనార్ధన్, యాదగిరి, వివిన్‌పాల్, నిసార్, అందరూ రాత్రి పదకొండింటికి మా తలుపు కొట్టి ఈ వార్త నాకు చెప్పారు. అంతే ఆ రాత్రి ఇంక ఎవ్వరం నిద్రపోలేదు.

అప్పటికప్పుడే కాలనే ఆడాకళ్ళంతా సావిత్రమ్మగారి ఇంటిదగ్గర చేరి సునీతాదేవి విషయం కథలూ, నవలలుగా మాట్లాడుకోసాగారు.

కొంతమంది మగాళ్లు కూడ ఓ గ్రూపుగా తయారయి– మాకు వినపడకుండా తమలో తాము చెవులు కొరుక్కోసాగారు.

"ఇదేం కిరికిరి భాయ్. ఇంగ్లీషోళ్ళ టైమ్‌లోనే 'సతి' బంద్ అయిపోయిం దనుకుంటే నలభై ఏండ్ల తరువాత మళ్ళా షురూ అయిందేమి సంగతి?" అడిగాడు యాదగిరి.

"మనదేశంలో ఆడాళ్ళు ఎప్పటికీ మారరు గురూ!"

"మూఢనమ్మకాలతో మసి అయిపోతుంటారు" అన్నాడు జనార్ధన్ సినిమా హీరో ఫోజులో చెట్టుమీద ఓ చేయి వేసి ఓ పక్కకు ఒరిగి నిలబడుతూ.

ఆ తరువాత ఉదయం వరకూ అందరం రాజస్థాన్‌లో ఇటీవల సతి జరిపిన యువతి రూప్ కన్వర్ గురించీ, ఆరోజు అక్కడివారు ప్రయోగించిన భయంకరమయిన పద్ధతుల గురించీ మాట్లాడుకున్నాము.

తెల్లారుతుండగా కాలనీలో వాళ్ళందరూ సునీతాదేవి ఇంటికి తిరణాల్లా వెళ్ళటం మొదలుపెట్టారు.

"పదండి– మనమూ వెళ్దాం! సంగతి ఎంతవరకూ నిజమో కనుక్కుందాం" అన్నాడు రంగారెడ్డి.

అందరం సునీతాదేవి వాళ్ళ ఇంటివేపు వెళ్ళాం. కాలనీ చివర్లలో ఉందది.

ఆమె భర్త ధర్మరాజు మా అందరికి బాగా తెలుసు. అతగాడు, వాళ్ళమ్మతోనూ. వాళ్ళక్కతోనూ కలసి మామగారు స్కూటర్ కొనివ్వలేదన్న నెపంతో సునీతాదేవిని రోజూ చావగొట్టటం, ఆమె బిగ్గరగా ఏడుస్తూండటం మా కాలనీలో అందరికీ తెలుసు.

ఒకసారి రాజేశ్వరీ, పార్వతీదేవిల ఆధ్వర్యంలో మా కమిటీ వాళ్ళందరం కలసి అతనింటికి వెళ్ళాం.

అప్పుడే ధర్మరాజు, వాళ్ళమ్మకలసి సునీతాదేవిని చావగొడుతున్నారు.

అందరం అతనిని ఆపటానికి ప్రయత్నించాం గానీ అతను మా మీదే తిరగబడ్డాడు.

"ఏంట్రా! నా పెళ్ళాన్ని నేను కొడతాను, నరుకుతాను మధ్యలో మీరెవరు బే!"

"నేను కాలనీ ప్రెసిడెంట్‌ని" అన్నాడు గోపాల్రావ్.

"ప్రెసిడెంట్ అయితే కాలనీ సంక్షేమం చూస్కో! నా పెళ్ళాం సంక్షేమం కాదు" అన్నాడు ధర్మరాజు.

"ఇగో– నీకు మర్యాదగా చెప్తున్నాం ఆమెను ఇంకొక దెబ్బ కొట్టారంటే పోలీస్ రిపోర్టిస్తాం" అన్నాడు శాయిరామ్.

"నీకేం సంబంధంరా ఇయ్యటానికి?"

"నేనే కాలనీ ఆర్గనైజింగ్ శెక్రట్రీ."

"తొక్కలో ఆర్గనైజింగ్ శెక్రట్రీ! నువ్వేంట్రా నాకు చెప్పేది?"

ఆ మాటతో శాయిరామ్‌కి ఎక్కడలేని పౌరుషం పొడుచు కొచ్చింది.

"ఏమిట్రా! నేను బోడి ఆర్గనైజింగ్ సెక్రటరీనా? రేయ్, నాకు ఈ అయిదేళ్ళలోనూ నాలుగు షీల్డు లొచ్చాయిరా! దమ్ముంటే నువ్‌చేయ్ ఆర్గనైజింగ్ సెక్రట్రీగా."

అంటూ ఈతని చొక్కా పట్టుకున్నాడు.

అందరం కలసి ముందు వాళ్ళిద్దరినీ విడదీశాం.

"చూడమ్మా- వీడు నిన్ను స్కూటర్ కోసం రోజూ చావగొడుతున్నట్లు కాగితం మీద రాసివ్వు. అయిదు నిమిషాల్లో లోపల తోయిస్తాం" అన్నాడు రంగారెడ్డి.

"రేయ్ రంగారెడ్డి- నువ్వు నాకు నీతులు చెప్తున్నావా? మీరందరూ మీ మామల దగ్గర పెళ్ళికి కట్నాలు దొబ్బలేదురా? పండగకు ఖరీదయిన సామానులు కొట్టుకు రాలేదురా? ఇప్పుడు నాకొచ్చి నీతులు చెప్తున్నారు సాలేగాళ్ళు!"

ఈ మాటతో అందరం గతుక్కుమన్నాం.

జనమంతా మా వేపు చూడసాగారు ఎక్స్‌ప్లనేషన్ కోసం.

నిజానికి రంగారెడ్డి రెండేళ్ళ క్రితమే వాళ్ళత్తగారు ఇచ్చిన డబ్బుతో గోద్రెజ్ అల్మారా తీసుకొచ్చాడు. గోపాల్రావ్ వాళ్ళ మామగారిచ్చిన డబ్బుతో స్కూటర్ కొన్నాడు. నేను మామగారు పంపిన డ్రాఫ్ట్ సహాయంతో టి.వి. సెట్ కొన్నాను.

"అసలీ మగజాలే అంత- ఎప్పుడూ అత్తమామలను పీక్కు తినడమే!" అనేసి వెనక్కు తిరిగి బిగ్గరగా స్లోగన్సు ప్రారంభించింది పార్వతీదేవి.

"మగాళ్ళ దురహంకారం-"

"డౌన్ డౌన్" అని అరచారందరూ.

"కట్న పిశాచం"

"నశించాలి."

"మగాడి కట్నకానుకల దాహం! బూడిదయిపోవాలి."

ధర్మరాజు తల్లి విసురుగా వచ్చింది పార్వతీదేవి దగ్గరికి.

"ఏమే నంగనాచిలా కేకలేస్తున్నావ్ గానీ నువు చేసినపని మాకు తెలీదనుకు న్నావా? ప్రతి పండగకు వెళ్ళి మీ పుట్టింటి వాళ్ళను దోచుకుని లారీలో సామానులు తేవటం ఎవడికి తెలీదు? మీ అక్కాచెల్లెళ్ళందరూ పీక్కు తినబట్టేగా మీ నాయనా సన్యాసుల్లో కలిసిపోయాడు. పైగా పత్తిత్తులాగా ఊరేగింపులు జరుపుతున్నావా?" అంటూ విరుచుకుపడింది.

"నేనేం మీలాగా పీడించుకు తీసుకు రావడం లేదు! మావాళ్ళే సంతోషంగా ఇస్తున్నారు."

"అలాగా! సిగ్గులేకపోతేసరి! వాళ్ళు సంతోషంగా ఇస్తున్నారో, ఏడుస్తూ ఇస్తున్నారో నీకెలా తెలుసు- ఇప్పుడు మాకూ స్కూటర్ సంతోషంగానే ఇమ్మని అడుగుతున్నాం."

పార్వతీదేవి ఎందుకయినా మంచదని వెనక్కు తగ్గింది.

ఆ తర్వాత మేము పెద్దగా మాట్లాడేందుకు మొఖం చెల్లక ఎవరి దారినవారు వెనక్కు వచ్చేశాం.

ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ వాడి జోలికిపోలేదు.

ఇప్పుడు ఆ ధర్మరాజు చనిపోయాడనేసరికి అందుకే మాకెవరకి విచారం కలగలేదు.

అతని భార్య సునీతాదేవి కూడా సంతోషిస్తోందనే అనుక్కున్నాం గానీ ఇప్పుడీ సతీ సహగమనం వార్త మమ్మల్ని ఆశ్చర్యచకితుల్ని చేసింది.

ఇంట్లో నుంచి ధర్మరాజు తల్లి ఏడుపులువినబడుతూనే వున్నాయి.

ఇంటిముందు ఆడామగా క్రిక్కిరిసిపోయి ఉన్నారు.

"రాజస్థాన్‌లో లాగానే ఈవిడ కూడా సతీసహగమనం చేస్తుందట" అంటూ అందరూ ఎగ్జయిట్‌మెంట్‌తో మాట్లాడుతున్నారు. మేము వాళ్ళందరినీ తోసుకుని ముందుకు వెళ్లాం.

చాలామంది పురోహితులు సతీసహగమనం ఏర్పాట్లు చేయడానికి సమావేశమయి కనిపించారు వరండాలో.

"ఇదన్యాయం, అక్రమం, అసంబద్ధం" అంటూ అరచాడు జనార్ధన్ మధ్యకెళ్ళి సినిమా ఫోజులో నిలబడి.

పురోహితులందరూ ఆశ్చర్యంగా చూళారతనివేపు.

"ఏమిటి నువ్ మాట్లాడేది?" అడిగాడొకతను.

"ఇదే ఈ సతి జరపటం మహా దుర్మార్గం! నా కంఠంలో ప్రాణం ఉండగా ఇలాంటిది జరగటానికి నేనొప్పుకోను" మళ్ళీ అరచాడతను.

"నీ కంఠంలో ప్రాణం ఉంటే మీ ఆవిడెందుకు సతి చేస్తుంది?" అన్నాడొకతను. "నీ ప్రాణం పోయాకే చేస్తుంది."

"నేననేది నా సంగతి కాదు. ధర్మరాజు భార్య సునీతాదేవి సంగతి." కోపంగా అన్నాడు.

"అవును. సునీతాదేవి సతి జరపటానికి వీల్లేదు" అరచాడు రంగారెడ్డి.

"ఇదిగో– దీనికి వ్యతికేకంగా మా కమిటీ పాస్ చేసిన రిజల్యూషన్ కాపీ" అన్నాడు శాయిరామ్.

"హిందు మత ధర్మానికి వ్యతిరేకంగా మీలాంటివాళ్ళు పాస్ చేసిన రిజల్యూషన్స్ చెల్లవ్ నాయనా!" అన్నాడు శ్యామ్రావ్ మాకు సర్దిచెపుతూ.

"మేమే కాదు! కేంద్రప్రభుత్వం కూడా సతికి వ్యతిరేకంగా బిల్‌పాస్ చేసింది" అన్నాడు గోపాల్రావ్.

"ప్రభుత్వం చాలా బిల్స్ పాస్ చేస్తుంది నాయనా! కానీ వాటిని ఎవరు అమలు పరుస్తున్నారు? వేటిదారి వాటిదే? ఆ మధ్య ముస్లిమ్ మతం విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని వాళ్ళు చెపితే ప్రభుత్వం వాళ్ళు చెప్పినట్లు చేసిందా లేదా? మరిప్పుడీ హిందూమతం జోలికెందుకొస్తున్నట్లు?" తిరిగి అడిగాడతను.

మాకేం మాట్లాడాలో తెలీలేదు.

"అంతా అబద్దం, హిందూమతంలో ఇలా చేయాలని ఎక్కడా లేదు" అరిచింది పార్వతీదేవి.

"ఉంది! ఉండబట్టే అలనాటి నుంచీ సతి ఆచారం వస్తోంది."

"లేదు."

"ఉంది."

"లేదు–

"అసలు ఆడదానికీ మంటకూ అవినాభావ సంబంధం ఉంది. ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఆడది కిర్సనాయిలు పోసుకుని తగలేసుకుని చనిపోవటం మన సంప్రదాయం! ఆనాటి సీతమ్మ వారి అగ్ని ప్రవేశం నుంచీ ఇవాల్టి వరకట్నాల చావులవరకూ అంతా అగ్నిమయం–"

రాజేశ్వరికి కోపం పొడుచుకొచ్చింది.

"సీతమ్మ అగ్ని ప్రవేశం సీన్ డౌన్ డౌన్! అది రాసిన వాల్మీకీ– డౌన్ డౌన్! అంటూ అరించింది.

మేమంతా కూడా సీత అగ్నిప్రవేశానికి వ్యతిరేకంగా కాసేపు నినాదాలు చేసాం!

మా అరుపులు విని శ్యామ్రావ్కీ, ధర్మరాజు తల్లిదండ్రులకు కోపం ముంచుకొచ్చింది.

"సతీసహగమనం జిందాబాద్– లోకసభ బిల్ డౌన్ డౌన్" అంటూ అరచారు వారి తరపున కొందరు.

"ఇదిగో– మీరీ వెధవపని ఆపకపోతే పోలీస్ రిపోర్టిస్తాం!" అన్నాడు శాయిరామ్.

"ఏమిటి? పోలీసులా! వాళ్ళేం చేస్తారు– వాళ్ళ మొఖం! డియోరాలాలో ఏం చేశారు? అంతా అయాక వచ్చి ఎఫ్.ఐ.ఆర్. రాసుకెళ్ళారు" అన్నాడు శ్యామ్రావ్ హేళనగా.

"గట్లనా! నీ పని ఇప్పుడే చెప్తా." అంటూ సైకిల్ మీద పోలీస్ స్టేషన్కి వెళ్ళాడు యాదగిరి.

సునీతా దేవికి పెళ్ళినాటి అలంకరణలు చేయసాగారు లోపల గదిలో. అప్పటికప్పుడే కొంతమంది మగా ఆడ ఆమెకు కిటికోలోంచే దణ్ణాలు పెట్టి చెంపలు వేసుకోసాగారు. మాకు వళ్ళు మండిపోతోంది వాళ్ళను చూస్తూంటే.

"ఏయ్, మీకేమయినా బుద్ధుందా? వాళ్ళను నాలుగు తిట్టాల్సింది పోయి మీరూ మూర్ఖంగా ప్రవర్తిస్తున్నారా?" అన్నాడు రంగారెడ్డి.

"మా ఇష్టమయ్యా! మా నమ్మకాన్ని కాదంటానికి నువ్వెవడివి" అంటూ ఎదురు తిరిగారు వాళ్ళు.

సరిగ్గా అప్పుడే పోలీసులు వచ్చారు వాన్లో.

"చూస్కోండి! ఇప్పుడు పోలీసులు వాళ్ళందరి మూసేస్తారు" అన్నాడు గోపాల్రావ్ హ్యాపీగా.

రాగానే మా గోపాల్రావ్ చొక్కా కాలర్ పట్టుకున్నాడు ఇన్స్పెక్టర్.

"పద వానెక్కు" అన్నాడు.

గోపాల్రావ్ నివ్వెరపోయాడు.

"ఎందుకు?" అడిగాడు ఆశ్చర్యంగా.

"ఈ స్కూటర్ నీదేనా?"

"నాదే!"

"మరి హెల్మెట్ ఏది?"

"మా ఇల్లు ఇక్కడే! అందుకని హెల్మెట్ తేలేదు"

"ఏయ్ సెవన్ వన్ జీరో– వీడిని వాన్లో వేసేయ్!"

మరుక్షణం ఇద్దరు కానిస్టేబుల్స్ వచ్చి గోపాల్రావ్ని లాక్కెళ్ళి వాన్లో వేసేశారు.

"దిసీజ్ టూ మచ్" అన్నాడు రంగారెడ్డి. ఇన్స్పెక్టర్ దగ్గరకెళ్ళి రెండు చేతులూ నడుమ్మీద పెట్టుకుని.

"వీడిని కూడా వాన్లోకి తోసెయ్యండి" అన్నాడు ఇన్స్పెక్టర్.

"నన్నా? నన్నెందుకు?"

ఇన్స్పెక్టర్కి ఏం చెప్పాలో తోచలేదు. రెండు క్షణాలు టోపీ తీసి బుర్ర గోక్కున్నాక అయిడియా వచ్చింది.

"ఎందుకేమిటి? యాంటీ టెర్రరిస్ట్ యాక్ట్ కింద"

ఇంక లాభంలేదని నేను కల్పిచుకున్నాను.

"అదికాదు ఇన్స్పెక్టర్ గారూ! మిమ్మల్ని పిలిపించింది మేము. అవతల ఆ శ్యామల్రావ్ అనేవాడు ఆ సునీతాదేవి బంధువులను రెచ్చగొట్టి సతీసహగమనం చేయిస్తున్నాడు. వాళ్ళ సంగతి చూస్తారని మేమనుకుంటుంటే మమ్మల్ని మూసేస్తానంటారేమిటి?"

"ఏయ్! నువ్వెవరు?" దబాయింపుగా అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఈ కాలనీ కమిటీకి వైస్ ప్రెసిడెంట్ని–"

"వీడ్ని కూడా లోపలవేసెయ్యండ్రా"

నేను కంగారుగా యదగిరివేపు చూశాను.

'ఈయనను లోపల వేశారంటే మీరు లోపటయిపోతారు! ఈయన ఈ కాలనీలోని 'తెలుగుదేశం' పార్టీ శాఖకు శెక్రటరీ" అన్నాడు యాదగిరి అబద్ధమాడేస్తూ.

ఆ మాట వినటంతోనే ఇన్స్పెక్టర్ ప్రవర్తనలో ఠక్కున మార్పు వచ్చేసింది.

"అలాగాసార్ మరి చెప్పరేం?" ఏయ్ సెవన్ వన్ జీరో! వాన్‌లోఉన్న వాళ్ళిద్దరినీ వదిలేసెయ్" అంటూ నావేపు తిరిగాడు మళ్ళీ.

"ఆ! చెప్పండి సార్! ఏమిటిప్పుడు ప్రాబ్లెమ్?".

జరిగిందంతా చెప్పాను.

"కానీ మతపరమయిన విషయాల్లో జోక్యం కలుగజేసుకుంటే కొంచెం రిస్క్ సార్" అన్నాడు ఇబ్బందిగా.

"ఓర్నీ! ఇందులో మతమేమిటండీ! అవతల మర్డర్ జరుగుతుంటేనూ?" చిరాగ్గా అన్నాడు రంగారెడ్డి.

"నేను అన్నీ ఎంక్వయిరీ చేశానండి! సునీతాదేవి తాత ముత్తాతలు రాజపుట్స్ వంశానికి చెందినవారట. అందుకని వాళ్ళకది పవిత్రమయిన ఆచారం–" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఆ ఆచారం ఆంధ్రప్రదేశ్‌లో ఎలా పాటిస్తారండీ! ఇక్కడ కేవలం మన ఆచారాలు మాత్రమే పాటించాలి!" అన్నాడు శాయిరామ్.

"మన ఆచారం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"పెళ్ళయిన రెండేళ్ళలోపే భార్యను కట్నకోసం చంపేయటం మన సాంప్రదాయం! సతీసహగమనం వరకూ భార్య బ్రతికి వుండకూడదసలు–" అన్నాడు రంగారెడ్డి.

"అవునవును! ఆ మాటా నిజమే!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ తలగోక్కుంటూ.

"యూ ఆర్ అండర్ అరెస్ట్. ఇక్కడి సంప్రదాయాలను పాటించనందుకు" అన్నాడు శ్యామ్రావ్‌తో.

శ్యామ్రావ్ కొంచెం జంకాడు.

"అదేమిటి సార్? ఇలాంటి మహత్తరమయిన సంఘటన మన రాష్ట్రంలో జరుగుతున్నందుకు మనమంతా గర్వించాలి. చూడండి! మన రాష్ట్రంలో సతీ గుడి ఒక్కటి కూడా లేదు. ఇప్పుడీ సతి ఏర్పాటు చేస్తున్నామనేసరికి చూడండి! ఆరులక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు, మన రాష్ట్రంలోని వర్తకులూ, రాజకీయ నాయకులూ! అందులో ఇద్దరు కలెక్టర్లు, పోలీస్ ఆఫీసర్లు కూడా ఉన్నారు–"

మేము తెల్లమొగం వేశాము.

"పోలీస్ ఆఫీసర్లు కూడా ఉన్నారా సార్?" భయంగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఇద్దరు"అన్నాడు శ్యామ్రావ్ ధైర్యం పుంజుకుంటూ.

"అయితే" అంటూ మళ్ళీ బుర్ర గోక్కుని నావేపు తిరిగాడు."పోనీ ఓ పని చేద్దాం! మనకేం తెలీనట్లు మనం వెళ్ళిపోదాం! సతి జరిగిపోయాక వచ్చి వాళ్ళను అరెస్ట్ చేస్తాం!" అన్నాడు ఆనందంగా.

"అది జరగడానికి వీలులేదనే కదయ్యా మేం మొత్తుకునేది?" చిరాగ్గా అన్నాడు

రంగారెడ్డి. ఈలోగా జనంలో త్రొక్కిసలాట ప్రారంభమయింది.

"జరగండి! మంత్రిగారొచ్చారు" అంటూన్నారెవరో.

మరుక్షణం మంత్రిగారి అంగరక్షకులు అందరినీ పక్కకు తోసివేస్తూ మంత్రిగారిని సునీతాదేవి ఇంటిదగ్గరకు తీసుకెళ్లారు.

ఆయన సునీతాదేవికి దణ్ణం పెట్టి, కాళ్ళు కళ్లకద్దుకొని చెంపలేసుకుని బయటికొచ్చారు మళ్లీ. దాంతో పార్వతీదేవి, రాజేశ్వరీ, సావిత్రమ్మ గారూ పెద్దగా కేకలేసుకుంటూ మినిష్టరు గారికి ఎదురువెళ్లారు.

"మినిష్టర్– డౌన్ డౌన్– సతీసహగమనం డౌన్ డౌన్–"

మినిష్టర్ చిరునవ్వు నవ్వారు.

"అలా తొందరపడకండి. సతీసహగమనం బాన్ చేస్తూ 'లా' రాబోతోంది త్వరలో. అంతవరకూ ఓపిక పట్టండి. నిజానికి నేనూ సతికి వ్యతిరేకినే–"

"అంతా అబద్ధం!" అదచాడు శాయిరామ్ ఆవేశంగా "మీరు వ్యతిరేకి అయితే ఇప్పుడు ఇక్కడికొచ్చి సునీతాదేవికి ఎందుకు దణ్ణంపెట్టి పూజలు చేశారు?"

"అది సీక్రెట్! చెప్పటం బావుండదు–"

"వీల్లేదు చెప్పాల్సిందే! లేకపోతే మిమ్మల్ని వెళ్ళనీయం ఇక్కడినుంచి."

ఆయన కొంచెం ఇబ్బందిగా అటూఇటూ చూసి చెప్పేశాడు.

"మరేం లేదు! మన జనంలో చాలామంది మూర్ఖులున్నారన్న సంగతి మాకు తెలుసు. వాళ్లందరికీ సతిలాంటి మూఢాచారాల మీద మాంఛి గురి వుంది. ఇప్పుడు మేము 'కాదు' అని గట్టిగా అరిచామంటే వచ్చే ఎలక్షన్లలో మా ఓట్లు గోవిందా! అపోజిషన్ వాళ్ళు ఇదే ఛాన్సనీ నెమ్మదిగా వాళ్ళను 'దువ్వి' మమ్మల్ని గెలిపిస్తే సతీసహగమనానికి 'భారతరత్న' లాంటి అవార్డులు ఇప్పిస్తాం! టీవీలో రోజూ ఓ సతి గుడి గురించి డాక్యుమెంటరీ చూపిస్తాం అనేసి గెలిచి పవర్‌లోకొచ్చేస్తారు. అంచేత ఎక్కడో ఒకరిద్దరు సతీసహగమనం చేసినంత మాత్రాన మనకు మునిగిపోయిం దేముందీ? దానికోసమని పదవులు పోగొట్టుకోమంటారా? మమ్మల్నిలా కోరటం మీకు న్యాయేమనా? చెప్పండి' అంటూ కన్నీరు తుడుచుకున్నాడు.

మా కందరికీ ఆయనను చూస్తే జాలి వేసింది.

"మరి మన తెలుగుపాఠం పుస్తకాల్లో కూడా సతి చాలా గొప్పదని స్తుతించే వాక్యాలు కొన్ని ఉన్నాయ్. అవయినా తీసేస్తారా లేదా?" అదమాయించింది రాజేశ్వరి.

"అరె! అలా మన గవర్నమెంట్ టెక్ట్స్ బుక్స్‌లో ఉందా? దిసీజ్ టూమచ్ ఇప్పుడే కమిటీ వేయిస్తాను" అంటూ హడావుడిగా వెళ్ళిపోయాడు.

మేము చూస్తూండగానే సునీతాదేవి గాయత్రి మంత్రం జపిస్తూ కాలనీ అంతా

నడవ సాగింది. కాలనీ మధ్యలోనే చితి ఏర్పాటు చేసేశారు క్షణాల్లో. అంతవరకూ మాతోపాటు సతికి వ్యతిరేకంగా నినాదాలు చేసిన స్త్రీలు చాలామంది మమ్మల్ని వదిలేసి వెళ్ళి సునీతాదేవికి భక్తితో మొక్కటం ప్రారంభించారు. మరి కాసేపట్లో సునీతాదేవిని తీసుకొచ్చి చితిలో కూర్చోబెట్టి ఆమె భర్త శరీరాన్ని ఆమె వళ్ళో పడుకో బెట్టారు. శ్యామలాప్రావ్ అదంతా వీడియో తీయిస్తున్నాడు, తర్వాత కాసెట్స్ అమ్ముకోటానికి.

మరుక్షణం చితికి నిప్పంటించారు. సునీతాదేవి కెవ్వున కేకవేసింది. భర్త శరీరాన్ని ఒక్కతోపు తోసిలేచి పరుగుతో రాబోయింది. అయితే చుట్టూ ఉన్న కొంతమంది ఆమెను బలంగా కర్రలతో కొట్టేసరికి చితిలోనే పడిపోయింది.

"దిసీజ్ టూ మచ్– ఇది ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా జరుగుతోంది" అంటూ గట్టిగా అరచి ముందుకు ఒక్క దూకు దూకాను.

మా ఆవిడా, పిల్లలూ, పక్కింటివాళ్ళూ అందరూ నాచుట్టూ మూగి ఉన్నారు.

"ఏమిటండీ! ఏం జరిగింది? ఎందుకలా కొంపలు మునిగేటట్లు కేకలు పెట్టి మంచమీద నుంచి కింద పడ్డారు?" అడిగింది మా ఆవిడ గాబరాగా.

"కలొచ్చింది" అన్నాను కింద నుంచి లేచి కూర్చుంటూ.

"ఏం కల?" పక్కింటావిడ అడిగింది నవ్వాపుకుంటూ.

"సునీతాదేవి లేదూ– వాళ్ళాయన ధర్మరాజు చచ్చిపోతే సతీసహగమనం చేసిందట–"

"సిగ్గులేకపోతేసరి! అలాంటి వెధవ కలలు కనడానికి!" అంది మా ఆవిడ. అప్పుడే రంగారెడ్డి, శాయిరామ్, జనార్ధన్, గోపాల్రావ్, యాదగిరి హడావుడిగా వచ్చారు లోపలకు.

"త్వరగా పద! ధర్మరాజు ఇంటికెళ్ళాలి మనం" అన్నాడు శాయిరామ్ ఆత్రుతగా.

"ఎందుకు? చచ్చిపోయాడా?" అడిగాను అనుమానంగా.

"లేదింకా! తలమాత్రం పగలిందట! వాళ్ళ అమ్మకూ, అక్కకూ మాత్రం గాయాలు బాగా తగిలాయంటున్నారు."

"అదేమిటి? ఏం జరిగింది?" అడిగాను ఆశ్చర్యంగా.

"నీకింకా తెలీదా? సునీతాదేవిని ఎప్పటిలాగానే కట్న కానుకల కోసం చావగొట్టి కిర్సనాయిలు పోసి చంపబోయారట. ఆమె ఎదురుతిరిగి కత్తిపీట తీసుకుని వాళ్ళందరి మీదా ఎటాక్ చేసింది–"